

# జూదం

కప్పగంతుల మల్లికార్జునరావు

ఆకాశం వురుముతోంది. మెరుపులు తళుక్కుమంటున్నాయి. వర్షం కురుస్తోంది. పగలే చీకటిగా వుంది వాతావరణం.

క్లబ్బు నిశ్శబ్దంగా వుంది.

రకరకాల సిగరెట్ల పొగలు దూది పింజల్లాంటి మేఘాల్లా క్లబ్బంతా విస్తరించాయి.

గ్లాసుల గలబ.... పేకముక్కల మెత్తటి చప్పుళ్లు.... బిలియర్డ్స బాల్‌ను టప్‌మని వొక్కసారి కొడ్తే మెత్తటి ఆరాటంతో అటూ యిటూ పరుగెడ్తున్న శబ్దం....

నిశ్శబ్దంలో అపస్వర సంగీతంలా విన్పిస్తున్నాయి.

విద్యుచ్ఛక్తి ఆగిపోతే తప్ప రాత్రికీ పగలుకీ భేదం లేదక్కడ.

క్లబ్బుముందు పోర్టికోలోకి వో టేక్సీ వచ్చి ఆగింది. అందులోంచి మిల్కీ వైట్ సఫారీ డ్రెస్ వేసుకొన్న వో యువకుడు దిగేడు. అతను తెల్లగా, అందంగా వున్నాడు.

అతడిని చూడగానే డోర్‌మేన్ మొహం ఫ్లేష్‌లైట్‌లా గయింది. అటెన్‌షన్‌లో నిలబడి సెల్యూట్ చేసేడు.

"వెల్‌కమ్ సర్...."

చిరునవ్వు చిందిస్తూ డోర్‌మేన్ వైపు చూచి తలను హుందాగా పంకించి అతను లోపలికి నడిచేడు.

"జమీందార్‌గారి కారేమయిందో? టేక్సీలో వచ్చాడు" అనుకున్నాడు డోర్‌మేన్ దూరంగా వెళ్తున్న టేక్సీని చూచి.

నగరంలోని పెద్దక్లబ్బుల్లో వొకటి అది. పెద్దపెద్ద వాళ్లే అక్కడికి వస్తారు. అసలు పెద్దవాళ్లకే అందులో ప్రవేశం. అక్కడ ఎవరికి ఏమి కావాలంటే అది దొరుకుతుంది.

ముందు రీడింగ్ రూమ్. జనం పల్చగా వున్నారక్కడ.

'టప్.... టప్.... టప్....' బిలియర్డ్స రూమ్.

బార్‌లో టేబిల్స్ ఖాళీగా లేవు.

వాటన్నిటినీ క్రీగంట చూస్తూ అతను మరింత లోపలికి వెళ్లి వో పెద్ద హాలు లోకి ప్రవేశించాడు. ఆ హాలు ఆ క్లబ్బుకు గుండెకాయ లాటింది.

'హల్లో రాజ్.... నైస్ టు సీయూ.. లాంగ్‌టైమ్.... ఊ. వెల్‌కమ్ టు అవర్ టేబిల్....'

కొన్ని టేబిల్స్‌వద్ద తొమ్మిదిమంది... మరికొన్నిచోట్ల ఆరుగురు.... అంతా తాపసుల్లా వున్నారు. వివిధ యోగసమాధలలో వున్నట్లున్నారు. అందరికీ వొక్కసారి తపోభంగమయినట్లయింది. రాజ్ పైకి వారి దృష్టి మళ్లింది.

'రాజ్.... రాజ్.... వెల్‌కమ్.... వెల్‌కమ్....'

రాజ్‌మోహన్ పేకాటలో ఎక్స్‌పర్ట్. పేకాట ప్రియులందరూ అనేక కారణాల వల్ల అతనితో ఆడటానికి యిష్టపడ్తారు. అయితే అవకాశం అందరికీ వుండదు.

రాజ్ హైస్టేక్స్‌తో కాని ఆడడు. ఎంత డబ్బున్నవాళ్లకు అంత హైస్టేక్స్ గేమ్ ఆడే ధైర్యం వుండదు.

నాన్ సరెండర్ ఆట ఆడటం రాజ్‌కు సర్దా. అంటే ఆ ఆటలో 'డ్రాప్' ఉండదు.

గెలిచినా వోడినా రాజ్ స్పోర్టివ్‌గా తీసుకొంటాడు. నిజానికి లాభనష్టాల ప్రమేయం లేకుండా పేకాట ఆడే ఋషిలా వుంటాడతను.

క్లబ్ బాయ్స్‌కి టిప్పుయిచ్చినా అంత భారీగానే యిస్తాడు. అందుకే అతడిని 'జమీందార్' అని ముద్దుగా పిల్చ

కొంటారు క్లబ్‌స్టాఫ్. అతను క్లబ్ కొచ్చిన రోజు వారికి పండుగే. అతను గెలిస్తే మరింత పండుగ.

అన్ని టేబిల్స్ వద్దనున్న తాపసుల్ని చూచి పలకరింపుగా చిరునవ్వు నవ్వేడు రాజ్. అలా చూస్తూ తన టేబిల్‌ని ఎన్నుకొన్నాడు.

'టెన్-ట్వంటీ' అన్నాడు వో కుర్చీలో కూర్చుంటూ.

క్లబ్‌బాయ్ వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు। రాజ్ జేబులోనుంచి చెక్ బుక్ తీసేడు. అలా తీసేటపుడు జేబులో నుంచి క్రిందపడ్డ కాగితాన్ని ఎవరూ గమనించలేదు.

చెక్ వ్రాసి బాయ్‌కిచ్చాడు. బాయ్ వెళ్లి క్షణంలో టోకెన్స్ తెచ్చి అతని ముందు పెట్టేడు.

* * *

స్వయంకృషితో డబ్బు సంపాదించి బ్రాహ్మణ మాన్యాలు కొని రాజ్‌మోహన్ తండ్రి వూళ్లో మోతుబరి రైతయ్యాడు. వొక్కడే కొడుకు కావటంచేత చిన్నప్పటినుంచి రాజ్‌మోహన్‌ని గారాబంగా పెంచేడు. కొడుకు పొలం పనులు ఎలాగూ చేయలేడని తెల్సి చదువులోకి దింపేడు.

రాజ్‌మోహన్ చిన్నతనం నుంచి ఇన్‌ట్రోవర్ట్. మనసులోని మాటను, బాధను ఎవరికీ చెప్పడు. మనసు నెరిగి అవసరాలను తీర్చాల్సిందే।

చిన్నతనంలోనే అతనికి పేకాట ఆడటంలో ప్రజ్ఞ ఏర్పడింది. చదువు, వయసుల్తోపాటు అది క్రమంగా ఫేషన్‌గా వ్యసనంగా మారింది.

టెన్త్‌క్లాస్ ఫెయిల్ కావటానికి కారణం పేకాటే. ఇంటర్‌తో చదువుకు స్వస్తి చెప్పటానికి కారణంకూడా పేకాటే.

తండ్రి చనిపోయాక తను ఎంత ధనవంతుడో తెల్సుకొన్నాడతను. వూరికే కాలుమీద కాలువేసు కూర్చొని తిన్నా తన జీవితం గడచిపోతుంది. కానీ పేకాట వ్యసనం అలా వూరికే కూర్చోనిస్తుందా? యింత డబ్బుతో పేకాట కౌగిట్లో బందీఅవుతే ఆస్తి మిగులునా? తను మిగులునా?

పేకాట తన వృత్తి కాదు. మరి ఏం చేయడం?

వ్యవసాయం చేతకాదు. వ్యాపారం... తన వల్లకాదు.


ఏదన్నా పరిశ్రమ పెడ్తే? వ్యవసాయం కన్నా యిప్పుడు పరిశ్రమలే గిట్టుబాటుగా వున్నాయి కదా?

అయితే పరిశ్రమ స్థాపనకు డబ్బుండగానే సరిపోతుందా? ఎన్నో లక్షణాలుండాలే!

అలా ఆచిలోస్తూండగా అతనికి లలితా రాణితో అనుకోకుండా పరిచయం అయింది.

* * *






ప్లేస్ సెలక్షన్‌కి, పేకను కలిపి తలావో ముక్కను పంచేరు.

సాంబశివం ఆత్రంగా తన ముక్కను ఎత్తేడు. అతనికి ప్లేస్‌ల సెంటిమెంట్ వుంది. రాజ్ హేండ్‌కు క్రింద వుంటే తన హేండ్ ఎక్కువస్తుందని అతని నమ్మకం. పెద్ద కార్డ్ పడితే తన ప్లేస్ సెలెక్షన్ తనదే.

కానీ అతని కొచ్చిన ముక్క ఆఠీన్ రెండు.

ప్లేస్టిక్ టోకెన్‌ను మొహాన బొట్టులా పెట్టుకొన్నాడు సత్తెనాథయ్యర్. 'మురుగా' అనుకొంటూ పేకముక్కని కళ్లకద్దుకొని తీసి చూసుకొన్నాడు. జాకీ. ఫర్వాలేదు.

అలా అందరూ తమ ముక్కలు చూచుకొన్నాక రాజ్ నెమ్మదిగా తన ముక్క తీసి చూచాడు. హైయస్ట్ కార్డ్ అతనిదే. కింగ్.

అతను ప్లేస్ సెలెక్ట్ చేసుకొన్నాడు— తను కూర్చున్న కుర్చీనే. పేకాట ఆడే వాళ్లందరికీ ఏదో విధమైన సెంటిమెంటు వుంటుంది. కానీ రాజ్‌కు ఎలాంటి సెంటిమెంట్ వుందో ఎవరికీ తెలియదు.

రాజ్ చేతిక్రింద చేయి కావాలని ఆశించిన సాంబశివం అతనికి పైచెయ్యి అయ్యాడు. రాణీ పద్ద దీపక్‌కుమార్ భంగ్ రాజ్‌కి క్రిందిచెయ్యి అయ్యాడు. ఆ తర్వాత చెయ్యి సత్తెనాథయ్యర్.

రాజ్ పేకను పరపరా కలిపి పంచేడు.

ఫస్ట్‌గేమ్ కనుక అది జాక్‌పాట్ అట. అంటే స్టేక్ డబుల్ అవుతుంది. రమ్మీ ఆటలో మొత్తం నూటముప్పై పాయింట్స్ వుంటాయి. అయితే ఫుల్‌కౌంట్‌గా

ఎనభై పాయింట్స్‌నే లెక్కకడ్తారు. ఒకరు 20 రూపాయల చొప్పున ఎనభై పాయింట్లకు 1600 రూపాయలు అవుతుంది. జాక్‌పాట్ ఆటలో ఇది రెట్టింపు మొత్తం అవుతుంది.

జాక్‌పాట్ ఆటలో జోకర్ కట్ చేయరు. రెండు పేకలమీద వొకే బొమ్మ జోకర్ ఆటలో వుంటుంది.

ఆ వొక్క జోకర్ రాజ్‌కి వచ్చింది. అయినా అతనికి ఆట కలవలేదు. పైగా అతను కళావర్ రాణీని క్రింద పారేయగానే దీపక్‌కుమార్ ఛంగ్ ఆ రాణీని కౌగిలించుకుని ముద్దుపెట్టుకుని 'షో' చేసేడు.

తనకు అక్కరలేని కళావర్ రాణీ దీపక్‌కుమార్‌కు అదృష్ట దేవత! ఆరాధ్య దైవం ఆ క్షణం!

* * *

లలితారాణి రాజ్‌మోహన్ ఆరాధ్య దైవం. ఆమె బొమ్మ వున్న కేలండర్ అతని గదిలో వుంది. మనసు బాగా లేనప్పుడు ఆ బొమ్మను అలాగే చూస్తూ కూర్చోడం అతనికిష్టం. అలా చూస్తుంటే అతని మనసు కుదుటబడుతుంది. బాధలన్నీ పోయినట్లనిపిస్తుంది.

రెండు సంవత్సరాలు తారగా వెలిగి క్రిందికి రాలిపోయిన సినిమా నటి లలితారాణి. ఆమె తారాపథాన్నుంచి జారిపడ్డా, రాజ్ మనోసామ్రాజ్యాన్ని ఏలుతున్న మహారాణి ఆమె.

అలాంటి ఆరాధ్య దైవాన్ని కల్సుకోటం ఎంత ఆనందదాయకం?

అయినా అతను తన ఆనందాన్ని బయటపెట్టలేదు.

ఎక్కువగా లలితారాణే అతనితో మాట్లాడింది. ఆమె అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పేడు అతను.

'పిల్లలెంతమందో మీకు?' ఆమె భావయుక్తంగా అతడిని చూస్తూ అడిగిందా ప్రశ్న. అప్పటి కామె అతని విషయమంతా తెల్సుకొంది.

నవ్వి తల అడ్డంగా వూగించాడతను.

'మీరు చాలా బాగా నవ్వుతారు. అసలే అందగాడివి ఆ నవ్వు మరింత అందాన్నిస్తుంది. కానీ ఆ నవ్వు అర్థం ఏమిటో? పిల్లలు లేరనా? పెళ్లి కాలేదనా?'

తండ్రి చనిపోయాక పిల్లనికట్నంతో సహా యిస్తామని ఎంతోమంది వచ్చారు. కానీ ఎందుచేతో అతనికి పెళ్లిచేసుకోవాలన్న యిచ్ఛ కలగలేదు.


మళ్లీ మరో రకంగా నవ్వేడతను.

'సినిమా నటికే పాఠాలు చెప్తున్నారే మీరు! మాట్లాడితే నోటిముత్యాలు రాలిపోతాయని భయమా? మీకు పెళ్లవలేదు, అవునా?

'అవును.'

'ఇంత అందం వుండి, ఆస్తి వుండి యింకా పెళ్లెందుకు చేసుకోలేదు? ఎవరన్నా సినీతారను ప్రేమించలేదు కదా?





ఆ ప్రశ్నతో అతనికి ఏదో స్ట్రయిక్ అయినట్లయింది. ఆమె వైపు చూశాడు. ఆమె గమ్మత్తుగా నవ్వి తల వంచుకుంది.

స్వయంగా అదృష్టదేవతే తనని వరించిన భ్రమ కలిగిందతనికి.

* * *

ముక్కలు పంచి జోకర్ కట్ చేశారు.

క్వీన్!

'దీపక్ కుమార్ యిందాక క్వీన్‌తో ఆట చేసేడు. యీసారి ఆ క్వీన్ జోకర్ అయి కూర్చుంది. యీసారి ఎవరిని వరిస్తుందో ఆ రాణి, సాంబశివం పేకముక్కల్ని తీసుకొంటూ అన్నాడు.

తీసుకొని ముక్కల్ని చూచి పెదవి విరిచాడు.

'నన్ను మాత్రం వరించలేదా భామ? నన్నెందుకు వరిస్తుందిలే. నేనేం అందగాడినా? రాజ్‌లాగా ధనవంతుడినా?' అంటూ సాంబశివం తన వంతు రాగానే 'డ్రాప్' అంటూ ముక్కలు కిందపడేశాడు.

జోకర్స్‌గా రాణులు వరించింది రాజ్‌నే. కానీ ఏం లాభం?

మూడు జోకర్స్ వుండి ఆట బతకలేదు. అన్నీ స్ట్రేకార్డ్స్!

డ్రాప్ చేద్దామనిపించిందతనికి. కానీ

ఆ కోరికను నిగ్రహించుకొన్నాడు. తను డ్రాప్ చేయటమా? ఎంత పరువు తక్కువ?

అయినా యీ రాణులు తననిలా మోసం చేస్తున్నాయేమిటి!

పేకలోనుంచి ముక్క తీసేడు. నేచురల్ స్వీకెన్సును కలిపే నాలుగు ముక్క అది.

'ఛీ. యీ నాలుగు కార్డ్సున్న విలువ లేని యీ రాణులు నా కెందుకు? అనుకొంటూ వో రాణిని తీసి క్రిందవేసేడు.

ఆశ్చర్యపోయారంతా.

'జోకరయ్యా బాబూ అది! తెల్సి పడేసినట్టా తెలీక పడేసినట్టా!' సాంబశివం అన్నాడు.

'తెల్సే పడేశాడు రాజ్. యిందాక రాణీ వేస్తే 'షో' చేసేడు థంగ్. యీ సారి రాణి జోకర్ కనుక స్వీకెన్స్ పెట్టుకోరెవరూ. కనక థంగ్‌కు ఆ ముక్క అవసరం వుండదు అని వూహించాడు.

కానీ చిత్రం!

స్వీకెన్స్‌ను డిస్టర్బ్ చేయటం ఎలాగా అని ఆలోచిస్తున్న థంగ్‌కు ఆ రాణి వరప్రసాదమే అయింది.

'థేంక్యూ బాస్....' అంటూ షో చేసేడు థంగ్.

రాజ్‌కు ఫుల్‌కౌంట్ అయింది.

'థంగ్‌సాబ్ యివాళ నక్కను తొక్కి వచ్చినట్లుంది' అన్నాడు సత్తెనాథ అయ్యర్ అసూయగా. అతని ఆట వొక్క ముక్కలో వుంది.

* * *

లలితారాణి మత్తులో మాధుర్యం.... ఓహ్!

'ఉద్యోగం పురుష లక్షణం' అన్నారు. సినిమా ప్రొడ్యూసర్ వుద్యోగం చాలా స్టేటస్ గలది. మీరు ఎలాగూ ఏదో ఇండస్ట్రీ పెట్టాలని ఆలోచిస్తున్నారుగా?

చీట్లపేక, రేస్, యిత్యాది జూదంలో విజయం సాధించాలంటే కొన్ని పట్లు తెలిసి వుండాలి. అవసరమైనప్పుడు మాట్లాడాలి. లేనప్పుడు మొహం తప్పించాలి. మంచితనం నటించాలి. మీ మనసు కరకుగా వుంచుకోవాలి.

యీ లక్షణాలున్న అతని స్నేహితుడు సింహాద్రి ప్రొడ్యూసర్ అయ్యాడు. కానీ తనకా లక్షణాలు లేవు. ఆ ఫీ గురించి తెలీదు. అందుకే దాన్ని గురించి ఆలోచించికూడా అందులోకి దిగదల్చుకోలేదతను.

'ఏమిటి ఆలోచిస్తున్నారు? నేనున్నానుగా?' రాణి అంది.

ఆ భరోసాతోనే రంగంలోకి దిగేడు రాజ్.


కానీ....

* * *

ఫస్ట్ రౌండ్ థర్డ్‌గేమ్. ముక్కలు పంచి జోకర్ కట్....

మళ్లీ రాణి!






పెదిమలు కొరుక్కున్నాడు రాజ్.

రాణి.... రాణి.... రాణి....!

అతని కెందుకో అపశకునంగా తోచింది. చేతి వణుకును కనబడనీయకుండా అతను ముక్కలెన్నెత్తేడు.

పదమూడు ముక్కల్లో నాలుగు ముక్కలు రాణీలే. అంటే జోకర్లు!

అందులో రెంటితో రెండు సెట్లు కట్టవచ్చు. కానీ నేచురల్ సీక్వెన్స్....?

అందుకు ముక్క కావాలి. సాంబశివం వేసిన ముక్కఎత్తితే తన సీక్వెన్స్ అవతల వాడు పసిగడ్తారు. పైగా రాణిని క్రింద పడెయ్యాలి.

అదృష్టం. యీసారి ఆట ఎవరికీ కల్పినట్లులేదు. ప్రొలాంగ్ అవుతోంది. పేకలో సీక్వెన్సు కలిసే ముక్కవచ్చింది కానీ దేన్ని పడెయ్యాలి?

యీసారి కూడా రాణీని వదులుకోలేదతను.

* * *

కానీ....?

ఊబిలోకి దిగేక రాణి అతడిని రక్షించలేదు.

కాగా తను జాగ్రత్తపడి అతడిని మరింత లోతుకి తోచింది.

కొంత రాణికోసం.... మరికొంత సినిమా కోసం....

అతని ఆస్తి రాజమంద్రిలో మురుగు నీరులా ప్రవహించింది.

అతని అనుభవ లేమిత్వాన్ని, బలహీనతల్ని అందరూ తలా వో రకంగా కేష్ చేసుకొన్నవారే.

ఔట్‌డోర్ షూటింగ్‌కి వెళ్తే మెస్ ఛార్జీలే కళ్ల మిరిమిట్లు గొలిపేటంత అయ్యాయి. ప్రతివాడికీ గెస్టులే. 'మెస్' ధర్మశాలయింది.

షూటింగ్ అంతా అయిపోయింది. కానీ సినిమా అంతటితో పూర్తి కాదు. కాని అతని ఆస్తిమాత్రం పూర్తిగా

అయిపోయింది. యింకా ఎన్నో ఖర్చులు!
ఎలా? ఎవరితో తన స్థితి చెప్పుకోటం?

ఎప్పుడూ లేనిది రాణితో చెప్పేడు.

'రాణీ, యీ బిల్డింగ్‌లో కొంత భాగమన్నా అమ్మేస్తే మన సినిమా....'

'ఛీఛీ.... మీరు జమిందారులండీ! అలాంటి మాట అనకూడదు. ఆడదాని సొమ్ము నాశిస్తాడా ఏ మగాడైనా? అందులోనూ నా రాజా హీమేన్‌లలో హీమేన్....'

బిల్డింగ్.... కారు.... చాలా భాగం ఆస్తి... అప్పటికే రాణిపేరిట వున్నాయి. తనకు మిగిలింది అసంపూర్ణమైన ఆ సినిమా రీల్సే!

ఆ సినిమా ఎలాగోలాగు పూర్తిచేసి రిలీజ్ చేస్తే...అదృష్టం ఎలా వుంటుందో?

అతను తన దగ్గర తనదంటూ మిగిలిన వాటినన్నింటినీ అమ్మి ఆ డబ్బు బ్యాంక్‌లో వేసేడు. ఆ డబ్బుతో డబ్బును సృష్టించాలి.

ఎలా?

* * *

మూడోసారి ఫుల్‌కౌంట్ యిస్తుంటే రాజ్ గుండె భయంతో వణికింది. యిలా ఫుల్‌కౌంట్స్ యిస్తూ ఎన్ని రౌండ్స్ ఆడగలడు తాను?

ఆ కాస్త డబ్బూ అయిపోతే ఆ తర్వాత....?

కష్టపడటం చాతకాక జీవితాన్ని జూదం చేసుకొన్నాడు తాను!

పేకాట చిన్నజూదం. తాను పెద్ద జూదం, సినిమా ప్రొడక్షన్ చాలా పెద్ద జూదం.

అన్ని అధికారాలున్న నాలుగు రాణీలు వుండి తనని తాను రక్షించుకోలేకపోయాడు— ఆటలో రాణులు తనని ఆదుకోలేదు.

యిది పేకాట జూదంలో వైచిత్రి!

తనని ఆదుకోగలశక్తిని తన ద్వారానే పొందిన రాణి తియ్యగా తప్పించుకొంది. అది జీవిత జూదంలో వైచిత్రి!

అవును. రాణి తన జీవితంతో జూదమాడి గెలిచింది.

తను రాణిని నమ్మి జూదమాడి వోడిపోయాడు— జీవితంలో వోడిపోయి యీ జూదమన్నా గెలుద్దామని వచ్చాడు.

కానీ యిక్కడా రాణీలే మోసం చేస్తున్నాయి.

యీ జూదంలో తను గెలిస్తేనే, రాణి తనతో ఆడే జూదంలో తనకి రాజుకున్న విలువ వుంటుంది. లేకపోతే తను జోకరే....?

'రాణి.... రాణి....రాణి.... ఐ లౌవ్ యూ....ఐ హేట్ యూ....'

నాలుగోసారి ముక్కలు కలిపి పంచేరు మిగిలిన పేకను క్రిందపెట్టి అందులో సగం ముక్కల్ని ఎడంచేత్తో తీసి పైకెత్తి పట్టుకొని క్రింద ముక్క తీయబోతున్నాడు వొకతను.



రాజ్ ఆత్రంగా జోకర్ కోసం నిరీక్షిస్తున్నాడు.

'అది రాణి కాకూడదు.... క్వీన్ కాకూడదు. క్వీన్ డిసీవ్ మీ.... రాణీ నన్ను మోసం చేస్తుంది, అనుకొంటున్నాడతను.

అడుగు ముక్క తీసి తను చూచి అందరికీ చూపేడతను.

అది.... అది....

'క్వీన్.... రాణీ.... మూడోసారి... వరసగా.... జోకర్.'

'ఆ! మళ్లీ జోకర్ రాణీనా! రాణి.... ఛీ....'

రాజ్ మెల్లగా గొణుక్కొన్నట్లు అన్నాడు.

అతని గొణుగుడు హఠాత్తుగా ఆగిపోయింది.

అతని తల వెనక్కి వాలిపోయింది.

* * *

సినిమా పూబిలో జిగి యింటికి తిరిగి వెళ్లటానికి ఛార్జీలులేని నిర్భాగ్యుల సహాయార్థం—

క్లబ్బులో పేకాటలో సర్వం కోల్పోయి, ఎదుటివాళ్ల ఔదార్యాన్ని కూడా ఖర్చు పెట్టేసుకొన్నాక, తృప్తిగా భోంచేసి హాయిగా నిద్రపోయే వసతి సౌకర్యార్థం—

యీ వ్యసనాలతో చనిపోయిన వారి అభాగ్య సంతతికి కొత్త అక్షరాలను అభ్యాసంచేసే నిమిత్తం—

జూదమాడంగా యింకా నా పేరిట నేను చనిపోయే సమయానికి డబ్బేమైనా మిగిలివుంటే వో ట్రస్టును ఏర్పాటు చేసి దాన్ని ఎవరైనా వుదారహృదయులు వినియోగించాలని కోరుకొంటున్నా.

నన్ను తగలెయ్యటానికి యీ డబ్బులో వో పైసా కూడా వాడకండి. నేను తీసిన సినిమా రీల్సుతో నన్ను చుట్టి కాల్చండి. నన్ను పూర్తిగా కాల్చటానిక్కూడా ఆ రీల్సు వుపయోగించక పోవచ్చు. అప్పుడు సగం కాలిన నా శరీరాన్ని గద్దల్ని రాబందుల్ని పీక్కుతిననీయండి. యిది నా చివరి కోరిక.

దిస్ యీజ్ మై లేస్ట్ విష్."

చెక్కుబుక్కు తీసేటప్పుడు క్రింద పడ్డ కాగితంలో రాసివున్నదది. అందరూ మొహమొహాలు చూచుకొన్నారు.

సాంబశివానికి ఏం బుద్ధి పుట్టిందో ఏమో హఠాత్తుగా రాజ్ ముందున్న పేక ముక్కల్ని తీసి చూచాడు.

'డీల్ షో.'

ఉత్సాహంతో, బిగ్గరగా ఏడవబోయి జాలిగా రాజ్‌మోహన్‌ని చూచాడు!

———